సాక్షి విశాఖపట్నం

శనివారం । 26 । ఏప్రిల్ । 2025



జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ తాటిచెట్లపాలెంలో ముస్లింలు శాంతియుత ర్యాలీ చేపట్టారు.

10లో



ఏయూకి శతాబ్ది ఉత్సవ శోభ

10లో

తీరంలో అలర్ట్

భద్రత కట్టుదిట్టం



నేవల్ బేస్‌లో సన్‌రైజ్ ఫ్లీట్ అత్యవసర సమావేశం

- పాక్ కవ్వింపు చర్యల నేపథ్యంలో తూర్పు నౌకాదళం అప్రమత్తం
- సాగరజలాల్లో దూకుడుగా సన్‌రైజ్ ఫ్లీట్
- సమర సన్నద్ధతపై సమీక్షించిన ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ పెందార్కర్
- ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలన్న తూర్పు నౌకాదళం
- వార్‌షిప్స్, సబ్‌మెరైన్లలో పనిచేసే సిబ్బందికి సెలవులు రద్దు
- సముద్ర జలాల్లో పహారా కాస్తున్న యుద్ధ నౌకలు
- సాగర గర్భంలో మాటువేసిన జలాంతర్గాములు



ఐఎన్ఎస్ డేగాలో నేవల్ ఎయిర్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ సిస్టమ్

సాక్షి, విశాఖపట్నం : ముష్కరుల దమనకాండతో భారత్ రగిలిపోతోంది. దౌత్య పరమైన చర్యలు ఇప్పటికే తీసుకొని పాక్ మూలాలపై దెబ్బకొట్టిన భారత్.. మరో అడుగు ముందుకేసి.. సమరానికైనా సిద్ధమంటూ హెచ్చరికలు జారీ చేస్తోంది. దేశ సరిహద్దుల్లో పెరుగుతున్న ఉద్రిక్తతలతో ఎలాంటి పరిస్థితిని అయినా ఎదుర్కొనేందుకు విశాఖ కేంద్రంగా తూర్పు నౌకాదళం సిద్ధమవుతోంది. సాగర జలాల్లో యుద్ధ సన్నద్ధతను చాటుకునే ప్రయత్నాలను ప్రారంభించింది. పాక్ నుంచి ఎదురయ్యే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు తీరంలో గస్తీని పెంచింది. సన్‌రైజ్ ఫ్లీట్‌ను అప్రమత్తం చేస్తూ ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ అత్యవసర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఏ సమయంలోనైనా ఎక్కడ నుంచైనా పరిస్థితుల్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మరోవైపు సముద్ర జలాల్లో యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్లు పహారా కాస్తున్నాయి. పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చేంతవరకూ వార్‌షిప్స్, సబ్‌మెరైన్లలో విధులు నిర్వర్తించే సిబ్బందికి సెలవులు రద్దు చేసినట్లు నౌకాదళ వర్గాలు చెబుతున్నాయి.

ఉగ్రమూకల దాడుల నేపథ్యంలో సరిహద్దుల్లో పెరుగుతున్న ఉద్రిక్త పరిస్థితులను ఎదుర్కొనేందుకు త్రివిధ దళాలు సిద్ధమవుతున్నాయి. ఇదే క్రమంలో విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న తూర్పు నౌకాదళం కూడా అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు అందాయి. దీంతో ఈస్టర్న్ నేవల్ కమాండ్‌లో అలర్ట్ ప్రకటించారు. బంగాళాఖాతంలో గస్తీని పెంచడంతో పాటు యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్లలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది సెలవులను కూడా రద్దు చేసినట్లు తెలుస్తోంది. తూర్పు నౌకాదళ పరిధిలోకి ఇతరుల ప్రవేశాన్ని కూడా నిషేధించారు. తూర్పు నౌకాదళాధిపతి రాజేష్ పెందార్కర్ తూర్పు స్వార్డ్ సన్‌రైజ్ ఫ్లీట్ సిబ్బందితో గురువారం సాయంత్రం అత్యవసర సమావేశం నిర్వహించారు. నేవల్ బేస్‌లో జరిగిన ఈ సమావేశంలో ఇటీవల చురుగ్గా కార్యకలాపాలు నిర్వహించిన సన్‌రైజ్ ఫ్లీట్ సిబ్బందిని ప్రశంసించారు. దేశ కార్యాచరణ అవసరాలు తీర్చేందుకు ప్రతి ఒక్క సెయిలర్, అధికారి సిద్ధంగా ఉండాలని ప్రకటించారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో భద్రతా పరిస్థితిపై మరింత దృష్టి సారించాలంటూ దిశానిర్దేశం చేశారు. అత్యవసర కార్యకలాపాలకు సంయమనంతో సిద్ధంగా ఉండాలని సూచించారు. మారిటైమ్ భద్రత, కార్యాచరణ సవాళ్లతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిపైనా దృష్టి సారించాలన్నారు. వ్యక్తిగత భద్రత, సైబర్, సమాచార భద్రత విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. దేశ ప్రయోజనాల కోసం.. భారతీయుల భద్రత కోసం ఎక్కడ నుంచైనా.. ఏ సమయంలోనైనా పోరాటం సాగించేందుకు సన్‌రైజ్ ఫ్లీట్ సిద్ధంగా ఉందన్న నమ్మకాన్ని దేశానికి కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ పిలుపునిచ్చారు.



సెయిలర్స్, నేవీ సిబ్బంది, అధికారులతో మాట్లాడుతున్న ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ పెందార్కర్

ఎలాంటి కవ్వింపు చర్యలనైనా ఎదుర్కొనేలా..

గతంలోనూ చైనా, పాక్ కవ్వింపు చర్యలకు పాల్పడినప్పుడు తూర్పు నౌకాదళం వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టింది. 1971లో పాక్‌పై విజయం సాధించడంలో ఈస్టర్న్ నేవల్‌కమాండ్ కీలక పాత్ర పోషించింది. మన యుద్ధ సన్నద్ధతను తెలుసుకునేందుకు పాక్ మరోసారి ఏమైనా చర్యలకు పాల్పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో బంగాళాఖాతంలో ఈఎన్‌సీ గస్తీ పెంచింది. తూర్పు నౌకాదళ పరిధిలో ఉన్న సుమారు 60 యుద్ధ నౌకలతో పాటు 6కిపైగా సబ్‌మెరైన్లు రంగంలోకి దిగాయి. సముద్ర జలాల్లో వార్‌షిప్స్ పహారా కాస్తుండగా.. సాగర గర్భంలో సబ్‌మెరైన్లు ఎలాంటి విపత్తునైనా దీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధమంటూ హెచ్చరికలు జారీ చేశాయి. మరోవైపు.. కోస్ట్‌గార్డ్ నౌకలతో నిరంతరం సముద్రంలో పహారా కాస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ ప్రత్యర్థి వ్యూహాలను అంచనా వేస్తున్నారు.

డ్రోన్లను తిప్పికొట్టేందుకు వ్యూహాత్మక అడుగులు

సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్న క్రమంలో ఈఎన్‌సీ ఎయిర్ బేస్ ఐఎన్ఎస్ డేగాలో యుద్ధ విమానాల పైలట్లకు శిక్షణ తీవ్రతరం చేశారు. వాస్తవంగా ఏడాది పొడవునా ఇక్కడ పైలట్ల శిక్షణ కొనసాగుతుంటుంది. కానీ ప్రస్తుతం యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న తరుణంలో దీన్ని మరింత చురుగ్గా కొనసాగించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని దాడులకు తెగబడుతున్న శత్రుదేశాల కుయుక్తుల్ని తిప్పికొట్టేందుకు భారత నౌకాదళం స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన నేవల్ ఎయిర్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ సిస్టమ్ (ఎన్ఏఐఎస్ఎస్)ను సిద్ధం చేశారు. ఎయిర్ స్టేషన్‌లో స్మార్ట్ ఫెన్స్‌ను అమర్చి.. సీసీకెమెరాల సాయంతో పహారా కాస్తున్నారు. స్మార్ట్ ఫెన్స్‌లోపలికి ఏ ఎయిర్‌క్రాఫ్ట్, హెలికాప్టర్, మనిషి వచ్చినా.. వెంటనే కంట్రోల్ రూమ్‌కు అప్రమత్తం చేయడంతో పాటు సెకెన్ల వ్యవధిలో మొత్తం వ్యవస్థకు సమాచారం అందజేస్తుంది. ఎయిర్‌స్టేషన్ చుట్టూ ఇన్‌ఫ్రారెడ్ డివైజ్‌లు, మోషన్ డిటెక్టర్స్, ఏ చిన్న రంధ్రం చేసి లోపలికి ఎవరు ప్రవేశించాలని భావించినా వారిని మట్టుపెట్టేలా యాంటీ పెనిట్రేషన్, థర్మల్ సెన్సార్లతో పాటు డ్రోన్ల పర్యవేక్షణతో పహారా ముమ్మరం చేసినట్లు సమాచారం. ఎయిర్ స్టేషన్‌కు దాదాపు 2 కిలోమీటర్ల వరకూ ఇన్‌ఫ్రారెడ్ సిగ్నల్స్ వ్యాపింపజేసి.. శత్రువుల చొరబాట్లను సులువుగా పసిగట్టనున్నారు. అదేవిధంగా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన నేవల్ యాంటీ డ్రోన్ సిస్టమ్ (ఎన్ఏడీఎస్)ని కూడా డేగాలో అప్రమత్తం చేశారు. భారీ డ్రోన్ల నుంచి తూనీగల పరిమాణంలో ఉన్న మైక్రో డ్రోన్ల వరకూ లేజర్ ఆధారిత కిల్ మెకానిజం సహాయంతో గుర్తించి.. వాటిని మట్టుపెట్టేలా రూపొందించిన ఈ వ్యవస్థ సాయంతో 360 డిగ్రీల కోణంలో.. 10 కిలోమీటర్ల పరిధిలో ఏ రకమైన డ్రోన్ ఉన్నా.. పసిగట్టి నాశనం చేయగలదు.

డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం!



- అభ్యర్థి తెలియక కూటమి పార్టీల్లో తికమక
- తమకేనంటూ జనసేన ప్రచారం
- తమకూ కావాల్సిందేనంటున్న టీడీపీలోని మరో వర్గం
- నేడు డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై అవిశ్వాసం విషయంలో కూటమి పార్టీల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డిప్యూటీ మేయర్ సీటు తమదేనని జనసేన నేతలు ప్రచారం చేస్తుండగా, కాదు కాదు మాకేనని టీడీపీ మేయర్ అభ్యర్థి పీలా శ్రీనివాసరావు అనుచరులు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో, డిప్యూటీ మేయర్ పదవి ఎవరికి కట్టబెడతారో తేల్చకుండానే కూటమి అవిశ్వాసానికి సిద్ధమైంది. శనివారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై అవిశ్వాసానికి కూటమి ఏర్పాట్లు చేసింది. డిప్యూటీ మేయర్ ఎవరికి ఇస్తారో తేల్చకుండా అవిశ్వాసానికి కూటమి నేతలు వెళుతుండడంతో కార్పొరేటర్లలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తమ వర్గానికి డిప్యూటీ మేయర్ పదవిపై స్పష్టత ఇస్తే తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటామని పదవి ఆశిస్తున్న కార్పొరేటర్లు కూటమి నేతలపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే, ముందుగా డిప్యూటీ మేయర్ అభ్యర్థిని ప్రకటిస్తే, మిగిలిన నేతల నుంచి నిరసన వ్యక్తమయ్యే అవకాశం ఉంది. దీంతో అవిశ్వాసం వీగిపోయే ప్రమాదముందని కూటమి నేతలు భావిస్తున్నారు. మొన్నటి మేయర్ అవిశ్వాసం ఓటింగ్‌లో కూడా చావుతప్పి కన్నులొట్టపోయిన చందంగా పరిస్థితి ఏర్పడింది. డిప్యూటీ మేయర్ విషయంలో మాత్రం అవిశ్వాసం వీగిపోతుందని కూటమి పార్టీల్లోని కార్పొరేటర్లే అంతర్గతంగా చర్చించుకుంటుండడం గమనార్హం.

తమకంటే తమకు కావాలంటూ...!

మేయర్ పదవి ఎవరికి ఇవ్వాలనే విషయంలో బహిరంగంగా అభ్యర్థిని ప్రకటించకపోయినప్పటికీ, అవిశ్వాసం సమయానికి స్పష్టత ఉంది. మేయర్ పోటీలో పీలా శ్రీనివాసరావు బరిలో ఉన్నట్లు కార్పొరేటర్లతో పాటు కూటమి పార్టీల్లోని నేతలకూ సమాచారం ఉంది. అయితే, డిప్యూటీ మేయర్ విషయంలో మాత్రం ఈ స్పష్టత ఎక్కడా లేదు. డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం విషయంలో కూటమి పార్టీలో చీలికలు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీకి మేయర్ పదవి ఇచ్చిన నేపథ్యంలో పొత్తు ధర్మంలో భాగంగా డిప్యూటీ మేయర్ తమకు కావాలంటూ జనసేన పార్టీ కోరుకుంటోంది. డిప్యూటీ మేయర్ పదవి తమకే ఇస్తారని ఆ పార్టీ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ కార్పొరేటర్ల సమావేశంలో చెప్పారు. అయితే, అదే సమయంలో ఆ పార్టీ నుంచి ఆరుగురు ఆశావహులున్నారు. జనసేన నుంచి కందుల నాగరాజు, ఉష శ్రీ, హేమలత, భీశెట్టి వసంతలక్ష్మి, వంశీరెడ్డి, సాధిక్‌లు పదవి ఆశిస్తున్నారు. వీరిలో ఎవరికి ఇస్తారనే విషయంలో ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఎవరికివారుగా తమదే సీటు అని ప్రచారం చేసుకుంటున్నారు. మరోవైపు టీడీపీలో కూడా డిప్యూటీ మేయర్ పోస్టు కోసం పోటీ ఉంది. పల్లా శ్రీను, గంధం శ్రీనులు ఆశిస్తున్నారు.

జనసేనలో కూడా చీలిక

జనసేన పార్టీలో కూడా డిప్యూటీ మేయర్ పదవి ఆశిస్తున్న వారిలో రెండు వర్గాలుగా విడిపోయినట్టు తెలుస్తోంది. మొదటి నుంచీ పార్టీలో ఉండి..కార్పొరేటర్‌గా పార్టీ గుర్తుపై గెలిచిన వారికే ప్రాధాన్యత ఉండాలనే వాదన ఉంది. ఈ వాదనను జనసేన ఫ్లోర్ లీడర్‌తో పాటు నిత్యం వార్తల్లో ఉండే మరో కార్పొరేటర్ తెరమీదకు తెచ్చినట్టు తెలుస్తోంది. అయితే మొదటి నుంచీ పార్టీలో లేరనే వాదనతో తమను పట్టించుకోకపోవడం సరికాదని ఉష శ్రీ, సాధిక్, కందుల నాగరాజు తదితరులు వాదనకు దిగుతున్నారు. డిప్యూటీ మేయర్‌గా మహిళలకే అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ ఫ్లోర్ లీడర్‌తో పాటు ఉష శ్రీ కూడా మరో వాదన వినిపించడం ప్రారంభించారు. దీంతో అభ్యర్థిత్వం విషయంలో ఆ పార్టీ కూడా తేల్చుకోలేకపోతోంది. ఇక సందులో సడేమియా అన్నట్టుగా స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలో నిలిచి గెలిచిన విల్లూరి భాస్కరరావు కూడా డిప్యూటీ మేయర్ పదవి కోసం తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నేత, ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మన్ సీతంరాజు సుధాకర్ ద్వారా ఆయన పావులు కదుపుతున్నట్టు సమాచారం. మొత్తంగా డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం విషయంలో కూటమి పార్టీల్లో నెలకొన్న విభేదాలు ఓటింగు విషయంలో స్పష్టంగా బయటపడే అవకాశం ఉందన్న అభిప్రాయం మాత్రం బలంగా వినిపిస్తోంది. తద్వారా వైఎస్సార్ సీపీ ఖాతాలోనే డిప్యూటీ మేయర్ పదవి ఉంటుందని కూడా అంతే బలంగా వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

వీధి దీపాలు కూడా వెలిగించలేకపోతున్నాం

- డీఆర్‌సీలో టీడీపీ ఎమ్మెల్యేల పెదవి విరుపు
- ప్రజాసంక్షేమంపై దృష్టిపెట్టాలన్న శాసనమండలి విపక్ష నేత బొత్స
- పారిశుద్ధ్య పోస్టుల్ని ఎప్పుడు భర్తీ చేస్తారన్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి బాలావీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, అధికారులు

సాక్షి, విశాఖపట్నం : ''ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాదవుతోంది. అయినా.. నగరంలో వీధి దీపాలను కూడా సరిగ్గా వెలిగించలేకపోతున్నాం. ఎటు చూసినా రాత్రి పూట అంధకారంగా కనిపిస్తోంది. కొన్ని ప్రాంతాలైతే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోకపోతే ఎలా.?''

జిల్లా అభివృద్ధి సమీక్ష మండలి సమావేశం (డీఆర్‌సీ)లో టీడీపీ ఎమ్మెల్యేలు మాట్లాడిన మాటలివి.

దాదాపు నలుగురు ఎమ్మెల్యేలు వీధిదీపాల సమస్యలు, పారిశుద్ధ్య లోపంపై ఫిర్యాదులు చేశారు. నగరం అధ్వానంగా మారిందనే రీతిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలా వీరాంజనేయ స్వామి దృష్టికి సమస్యలు తీసుకెళ్లారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఆర్‌సీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇన్‌చార్జి మంత్రితో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కలెక్టర్ హరేందిర ప్రసాద్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, జేసీ మయూర్ అశోక్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తొలుత ఇటీవల ఉగ్రవాద కాల్పుల్లో మృతి చెందిన చంద్రమౌళి, మధుసూదన్‌కు నివాళులర్పిస్తూ మౌనం పాటించారు. అనంతరం జరిగిన సమీక్షలో నియోజకవర్గాల వారీగా.. ఎమ్మెల్యేలు సమస్యలను ఇన్‌చార్జి మంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వీఎంఆర్డీఏ పరిధిలో చేపట్టే మాస్టర్ ప్లాన్ రోడ్లను, ఇతర ప్రాజెక్టులను వీలైనంత త్వరగా పట్టాలెక్కించాలని ఇన్‌చార్జి మంత్రి ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ విషయంలో స్థానిక ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. సదరం స్లాట్ల విషయంలో వెసులుబాటు కల్పించాలని, ప్రజలకు సమీపంలోని ఆరోగ్య కేంద్రాల్లో స్లాట్ ఇవ్వాలన్నారు. మేఘాద్రి గెడ్డ, గంభీరం రిజర్వాయర్ల నిర్వహణపై సమీక్షించిన ఆయన ప్రభుత్వ నిర్దేశాల మేరకు తుది చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీధిదీపాల నిర్వహణపై ఆడిట్ చేయించి యుద్ధప్రాతిపదికన వేయించాలని అధికారులను ఆదేశించారు. 100 గజాల లోపు స్థలంలో ఇళ్లు కట్టుకునే వారికి సెల్ఫ్ సర్టిఫికేషన్ విషయంలో అడ్డంకులు సృషించకుండా అవగాహన కల్పించాలన్నారు. ప్రజల సమస్యలపై దృష్టి సారించి.. వాటిని పరిష్కరించే దిశగా ప్రభుత్వం పనిచెయ్యాలని మండలి విపక్ష నేత బొత్స సూచించారు. ఇటీవల 60 ఏళ్లు దాటిన జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బందిని తొలగించిన ప్రభుత్వం.. వారి స్థానంలో కొత్తవారిని నియమించకపోవడం వల్ల నగరంలో శానిటేషన్ మరుగున పడిందని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం 500 మంది సిబ్బంది ఖాళీలున్నాయనీ.. కాంట్రాక్టు వర్కర్లతో ప్రస్తుతానికి పనిచేయిస్తున్నామని అధికారులు తెలిపారు.

జీవీఎంసీ జోన్ల పునర్‌వ్యవస్థీకరణపై చర్చ

పరిపాలన సౌలభ్యం కోసం జీవీఎంసీ జోన్ల పునర్ వ్యవస్థీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ హరేందిర ప్రసాద్ ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఉన్న జోన్లని ఆయా నియోజకవర్గాలకు అనుగుణంగా సరిహద్దులు మార్పులు చేపడతామని వెల్లడించారు. ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో జోన్‌గా రూపాంతరం చెందనున్నట్లు తెలిపారు.

రెండు సెంట్లు ఇస్తాం..

అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి బాలా వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లోనే ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా కొనసాగుతున్నాయని తెలిపారు. అయితే.. అప్పుడు తీసుకున్న ఒక సెంటు ఇంటి స్థలం వద్దనుకునేవారికి రెండు సెంట్లు స్థలం ఇస్తామని వ్యాఖ్యానించారు. సెంటు భూమి వద్దనకునేవారి జాబితాల్ని సేకరించేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంపై విజిలెన్స్ ఎంక్వయిరీ కొనసాగుతుందని మంత్రి వెల్లడించారు.

'సాక్షి'పై మంత్రి చిందులు

కూటమి ప్రభుత్వం చేస్తున్న అడ్డగోలు పనులపై ప్రశ్నించినందుకు టీడీపీ ప్రజా ప్రతినిధులు చిందులేశారు. డీఆర్సీ సమావేశం అనంతరం మీడియాతో ఇన్‌చార్జ్ మంత్రి వీరాంజనేయ స్వామితో పాటు ఎమ్మెల్యేలు మాట్లాడారు. ఈ సమయంలో ఊరు పేరు లేని ఉర్సా కంపెనీ, టీసీఎస్ కి 99 పైసలకు భూకేటాయింపులపై 'సాక్షి మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. ఏ కంపెనీకైనా ఇలాగే భూములు కేటాయిస్తారా అని ప్రశ్నించగా.. ఎమ్మెల్యే వెలగపూడి, ఇతర ఎమ్మెల్యేలు ప్రశ్నిస్తోంది సాక్షి ప్రతినిధులని మంత్రికి చెప్పారు. దీంతో మంత్రి ఒక్కసారిగా పూనకం వచ్చినట్లు మాట్లాడారు. కంపెనీ ప్రొఫైల్ చూసే భూములిచ్చామని, ప్రశ్నించడానికి మీరెవరంటూ చిర్రుబుర్రులాడారు. వెంటనే వెలగపూడి అందుకొని సాక్షిని ఎందుకు మీటింగులకి పిలుస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీఎం కాన్వాయ్ కోసం.. షాపుల తొలగింపు

సింహగిరిపై వర్తకులకు హుకుం జారీ చేసిన అధికారులు



నూతన షాపింగ్ కాంప్లెక్స్‌లోకి సామగ్రి తరలిస్తున్న వర్తకులు

సింహాచలం: చందనోత్సవం సమీపిస్తుండటంతో సింహాచలం దేవస్థానం అధికారులు హడావుడి చేస్తున్నారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా కాన్వాయ్ కోసం స్థలం సిద్ధం చేయాలంటూ ఉన్నట్టుండి దుకాణాలు ఖాళీ చేయాలని ఆదేశించడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరతరాలుగా సింహగిరిని నమ్ముకుని వ్యాపారం చేసుకుంటున్న వీరు, చేసేది లేక అసంపూర్తిగా ఉన్న నూతన షాపింగ్ కాంప్లెక్స్‌లోకి సామాన్లు తరలిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే, సింహాచలం దివ్యక్షేత్ర అభివృద్ధి పనుల్లో భాగంగా 2008లో కొండపై బస్టాండ్ వద్ద రేకులతో తాత్కాలిక దుకాణాలు నిర్మించి వ్యాపారులకు కేటాయించారు. ప్రసాద్ స్కీమ్ కింద నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడంతో, 2023 డిసెంబర్‌లో వ్యాపారులను ఖాళీ చేయించి పాదాలమ్మ-బంగారమ్మ ఆలయాల సముదాయంలో తాత్కాలికంగా షాపులు ఏర్పాటు చేశారు. 2024 చందనోత్సవం నాటికి కొత్త షాపింగ్ కాంప్లెక్స్ పూర్తి చేస్తామని చెప్పడంతో వ్యాపారులు అక్కడికి వెళ్లారు. అయితే, ఇప్పటికీ నూతన షాపింగ్ కాంప్లెక్స్ పనులు పూర్తి కాలేదు.

ఇలా ఉండగా, రెండు రోజుల క్రితం దేవస్థానం అధికారులు హఠాత్తుగా తాత్కాలిక షాపింగ్ కాంప్లెక్స్‌ను ఖాళీ చేసి కొత్త కాంప్లెక్స్‌లోకి వెళ్లాలని ఆదేశించారు. చందనోత్సవానికి సీఎం వస్తున్నారని, ఆయన కాన్వాయ్ కోసం స్థలం కావాలని ఒకసారి, పార్కింగ్ స్థలం అవసరమని మరోసారి చెప్పడంతో వ్యాపారులు ఆందోళన చెందారు. కొత్త షాపింగ్ కాంప్లెక్స్‌లో ఇంకా విద్యుత్ సరఫరా లేదని, ఎక్కడపడితే అక్కడ రాళ్లు,రప్పలు ఉన్నాయని, ఉన్నట్టుండి ఎలా వెళ్లాలని వారు ప్రశ్నించారు. అంతేకాకుండా, ఈ నెల 26, 27 తేదీల్లో గంధం అమావాస్య పర్వదినాల కారణంగా భక్తులు ఎక్కువగా వస్తారని, అప్పుడు షాపులు మారిస్తే నష్టం వాటిల్లుతుందని వారు వాపోయారు. అయినా సరే దుకాణాలు ఖాళీ చేయాల్సిందేనని అధికారులు తేల్చి చెప్పారు. దీంతో చేసేది లేక వ్యాపారులు శుక్రవారం నుంచి తమ సామాన్లను కొత్త కాంప్లెక్స్‌లోకి తరలిస్తున్నారు. 2024 చందనోత్సవం సమయంలో పాదాలమ్మ-బంగారమ్మ ఆలయ ప్రాంగణంలో తాత్కాలిక షాపులు ఉండటంతో అక్కడ పార్కింగ్ ఏర్పాటు చేయకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది.

నేడు సీఎం రాక

బీచ్‌రోడ్డు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం విశాఖ నగరంలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి బయలుదేరుతారు. 11.30 గంటలకు విజయవాడ విమానాశ్రయం నుంచి విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 12 గంటలకు శ్రీకాకుళం చేరుకుని, అక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీకాకుళం నుంచి హెలికాప్టర్ ద్వారా బీచ్ రోడ్డులోని కోస్టల్ బ్యాటరీ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఆంధ్ర మెడికల్ కాలేజీకి చేరుకుని, ఆంధ్ర మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శతాబ్ది భవనాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం 7 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి విమానాశ్రయానికి చేరుకుంటారు. విమానంలో తిరిగి విజయవాడకు వెళ్తారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం సాయంత్రం ఏర్పాట్లను పరిశీలించారు.

జోహార్ చంద్రమౌళి


చంద్రమౌళి అంతిమయాత్రలో పాల్గొన్న కుటుంబసభ్యులు, స్నేహితులు


రోదిస్తున్న చంద్రమౌళి కుమార్తె

ఉగ్రమూకల చేతిలో అమరుడైన విశ్రాంతి బ్యాంక్ ఉద్యోగి చంద్రమౌళి అంత్యక్రియలు శుక్రవారం చావులమదుం శ్మశానవాటికలో జరిగాయి. అంతకుముందు జరిగిన అంతిమ యాత్రలో పలువురు రాజకీయ ప్రముఖులు, అతని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

నాటి సంస్కరణల ఫలితం..
'పది'లో రికార్డ్ విజయం

- నడుపూరు ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఫలితాలు
- 500+ మార్కులతో మెరిసిన 49 మంది విద్యార్థులు
- విద్యార్థులను కార్లలో ఊరేగించిన టీచర్లు


10వ తరగతిలో 584, 580 మార్కులు సాధించిన విద్యార్థులను ఊరేగిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

పెదగంట్యాడ: నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో సంచలన ఫలితాలు సాధించి, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నిలిచారు. ఈ ఏడాది ఏకంగా 49 మంది విద్యార్థులు 600 మార్కులకు గాను 500కు పైగా మార్కులు సాధించడం విశేషం. ఈ నేపథ్యంలో పాఠశాల ఉపాధ్యాయులు వినూత్నంగా సంబరాలు చేసుకున్నారు. ఈ అద్భుత విజయానికి ప్రధాన కారణం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యారంగానికి ఇచ్చిన ప్రాధాన్యం, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలే అని చెప్పడంలో సందేహం లేదు.

నాడు–నేడుతో మారిన రూపురేఖలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన 'నాడు–నేడు'పథకం ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలనే మార్చి వేసింది. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.1.86 కోట్లు కేటాయించి, పాఠశాల భవనాలకు జీవం పోసింది. తరగతి గదులు ఆధునికీకరణ, డిజిటల్ బోర్డులు, టీవీల ఏర్పాటు, సురక్షితమైన టాయిలెట్లు, తాగునీటి ప్లాంట్, ఫ్లోరింగ్, మెరుగైన వాతావరణం కోసం మొక్కల పెంపకం వంటి మౌలిక సదుపాయాలను కల్పించింది. ఇలా ప్రయివేటు పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనకు అవసరమైన వాతావరణాన్ని సృష్టించింది. అయితే.. ప్రభుత్వం మారిన తర్వాత 8 తరగతి గదుల నిర్మాణం నిధుల్లేక అసంపూర్తిగా మిగిలిపోవడం గమనార్హం.

ప్రోత్సాహం, పట్టుదలతో ఫలితాలు

ప్రభుత్వం కల్పించిన ఈ అద్భుతమైన మౌలిక వసతులు, ప్రోత్సాహకాలకు తోడు పాఠశాల ఉపాధ్యాయుల అంకితభావం, కృషి కూడా ఈ విజయంలో కీలక పాత్ర పోషించాయి. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించడం, వారి సందేహాలను నివృత్తి చేయడం, పరీక్షల భయాన్ని పోగొట్టి వారిని సన్నద్ధం చేయడంలో ఉపాధ్యాయులు సఫలీకృతులయ్యారు.

ప్రజల్లోకి విజయం

ఈ విజయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని పెంచేందుకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు విద్యార్థులను కార్లలో ఊరేగించారు. విద్యార్థులు సాధించిన మార్కులను ప్లకార్డుల ద్వారా ప్రదర్శిస్తూ.. ప్రైవేటుకు స్వస్తి పలికి సర్కార్ బడుల్లో చేర్పించాలంటూ విస్తృత ప్రచారం చేశారు. అలాగే ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు, వారికి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులకు హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ శుక్రవారం ప్రత్యేకంగా విందు ఏర్పాటు చేసి అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన విజయంతో గర్వంగా ఉందన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో చదివిస్తున్న పిల్లలను సైతం ఇక్కడ చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందితో కలసి ఆరు బృందాలను ఏర్పాటు చేశామని, నాలుగు రోజుల పాటు మండలంలోని ఇంటింటికీ వెళ్లి పిల్లలను తమ బడిలో చేర్పించాలని కోరుతున్నట్లు వివరించారు.

వసతులతో పెరిగిన ఆసక్తి


తరగతి గదిలో డిజిటల్ బోర్డులు, స్మార్ట్ టీవీ

నాడు–నేడుతో పాటు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం **అమలు చేసి**న అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, **నాణ్యమైన** మధ్యాహ్న భోజనం, విద్యార్థుల **ఆరోగ్య సం**రక్షణ కోసం నిర్వహించిన ఆరోగ్య **శిబిరాలు** వంటి పథకాలు పేద విద్యార్థులను బడికి దగ్గర చేశాయి. ముఖ్యంగా ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులను సిద్ధం చేసే లక్ష్యంతో డిజిటల్ విద్యకు ప్రాధాన్యతనిచ్చారు. పాఠశాలలకు డిజిటల్ బోర్డులు, టీవీలు ఏర్పాటు చేసి అద్భుతమైన కంటెంట్‌ను రూపొందించారు. విద్యార్థులు ఇళ్ల వద్ద కూడా ఆయా సబ్జెక్టులను రివిజన్ చేసుకునేందుకు వీలుగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించారు. ఈ పథకాలన్నీ విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంచి.. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెరగడానికి దోహదపడ్డాయి.

నలుగురు క్రికెట్ బుకీల అరెస్ట్

విశాఖ సిటీ: క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురు బుకీలను సైబర్ క్రైం పోలీసులు సాంకేతిక ఆధారాలతో అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఆదర్శనగర్ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్ వెబ్‌సైట్లలో బెట్టింగ్ ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో సైబర్ క్రైం, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అతనిపై నిఘా పెట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో చాకచక్యంగా వ్యవహరించి ఈ నెల 20న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతడిని విచారణ చేసిన సమయంలో మరో నలుగురు మధురవాడ ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్‌ను అద్దెకు తీసుకుని బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్నారు. మధురవాడ, శివాజీపాలెం, చినగదిలి ప్రాంతాలకు చెందిన ముగ్గురిని 23న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. వారిలో ఒకరు ఏయూలో గ్రేడ్–2 డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. మిగిలిన వారు ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్నారు. వారు నేరాలకు ఉపయోగించిన ల్యాప్‌టాప్, నాలుగు స్మార్ట్‌ఫోన్లు, రెండు బేసిక్ మొబైల్‌ఫోన్లను సీజ్ చేశారు. ఈ కేసులో ప్రధాన ముద్దాయితో పాటు బెట్టింగ్ ఆడుతున్న వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఒకరికి పదేళ్ల జైలు

టీచర్‌రోడ్డు: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఒక వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ 11వ అదనపు జిల్లా కోర్టు స్పెషల్ జడ్జి తీర్పునిచ్చారు. మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2017లో పిడుగు నరేష్ కుమార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. విచారణ అనంతరం ప్రత్యేక న్యాయమూర్తి శుక్రవారం తీర్పు వెలువరించారు. అలాగే బాధితురాలికి రూ.4 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు ముద్దాయిని సెంట్రల్ జైలుకు తరలించినట్లు స్టేషన్ సీఐ పైడయ్య తెలిపారు.

రద్దీ ప్రాంతాల్లో కాపు కాసి.. బైక్‌ల చోరీ

- ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్
- 17 వాహనాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న ఏడీసీపీ, ఏసీపీ తదితరులు

ఎంవీపీకాలనీ: నగరంలో ద్విచక్ర వాహనాలను దొంగతనం చేస్తున్న కోట శివ అనే పాత నేరస్తుడిని ఎంవీపీ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. అతను పార్వతీపురం మన్యం జిల్లా, సీతానగరం మండలం, కోట సీతారామపురం గ్రామానికి చెందినవాడిగా గుర్తించారు. క్రైం ఏడీసీపీ మోహనరావు తెలిపిన వివరాలివి.. మార్చి 17న పెదవాల్తేర్ రిలయన్స్ మార్ట్ ఎదుట దాసరి శంకరరావు అనే వ్యక్తి హోండా యాక్టీవా దొంగతనానికి గురైంది. మార్ట్ ఎదుట వాహనాన్ని పార్క్ చేసిన శంకరావు పక్కనే ఉన్న చికెన్ షాపుకు వెళ్లి వచ్చేసరికి వాహనం కనిపించలేదు. దీనిపై ఎంవీపీ క్రైం పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ద్వారకా క్రైం సీఐ చక్రధర్‌రావు నేతృత్వంలో పోలీసులు మార్ట్ సమీపంలోని సీసీ టీవీ పుటేజ్‌లను పరిశీలించి నిందితుడిని గుర్తించారు. అతను చివరిగా సంచరించిన ప్రాంతాన్ని గుర్తించి.. సెల్‌ఫోన్ నంబర్‌ను కనుగొన్నారు. ఆ సెల్‌ఫోన్ ఆధారంగా నిందితుడు కోట శివగా నిర్ధారించారు. ఈ నెల 24న అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. నిందితుడు కోట శివ ముఖ్యంగా జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో కాపు కాసేవాడు. ఏమరపాటుగా ఎవరైనా తమ బైక్‌కు తాళాలు వదిలి వెళితే.. వెంటనే బైక్‌ను దొంగిలించేవాడు. విచారణలో శివ ఎంవీపీ కాలనీ, వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, ద్వారకా పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 17 ద్విచక్ర వాహనాలను దొంగలించినట్లు అంగీకరించాడు. అతను 2024 నుంచి నగరంలో వాహనాలు చోరీ చేస్తున్నట్లు తేలింది. శివపై గతంలో 31 కేసులు ఉన్నాయని, జీఆర్పీలో సస్పెక్ట్ షీట్ కూడా ఉందని పోలీసులు గుర్తించారు. అతని నుంచి సేకరించిన సమాచారంతో 17 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని శుక్రవారం కోర్టులో హాజరు పరచగా, రిమాండ్ విధించింది. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన ద్వారకా క్రైం సీఐ చక్రధర్‌రావుతో పాటు ఎస్ఐ అప్పలరాజు, ఏఎస్ఐ కిశోర్‌బాబు, పీసీలు జగత్ కిరణ్, హరిప్రసాద్, సాయి, అప్పలరాజు, అగస్టీన్‌లను ఉన్నతాధికారులు అభినందించారు. సమావేశంలో ఏసీపీ లక్ష్మణరావు, సీఐ చక్రధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూకి శతాబ్ది ఉత్సవ శోభ

- నేటి నుంచి శతాబ్ది సంవత్సరం ప్రారంభం
- ఏడాది పొడవునా కార్యక్రమాలు


విద్యుత్ కాంతుల్లో ఏయూ పరిపాలన భవనం

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏడాదిపాటు జరిగే ఈ వేడుకల ప్రారంభోత్సవానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ కోర్ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. శనివారం ఉదయం 6 గంటలకు బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయం వద్ద కలెక్టర్ హరేందిర ప్రసాద్ వాకథాన్‌ను ప్రారంభిస్తారు. అనంతరం సిరిపురం, స్నాతకోత్సవ మందిరం, పరిపాలన భవనం వద్ద ఉన్న కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రత్యేక బెలూన్‌ను ఎగురవేస్తారు. మధ్యాహ్నం 3.30 గంటలకు బీచ్ రోడ్‌లోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రధాన వేడుకలు జరుగుతాయి. సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రారంభమైన తర్వాత ఏయూ విజన్ డాక్యుమెంట్, లోగో ఆవిష్కరణ, ప్రత్యేక నృత్య రూపకం ప్రదర్శిస్తారు. అనంతరం పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్, వీసీ, అతిథుల ప్రసంగాలు ఉంటాయి. సాయంత్రం 6.30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొంటారు. వర్సిటీ భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఏడాది పొడవునా అకడమిక్, ఔట్రీచ్, మెగా ఈవెంట్లు నిర్వహిస్తామని, 2026 ఏప్రిల్ 26న ముగింపు వేడుకలు ఘనంగా ఉంటాయని తెలిపారు. మెగా ఈవెంట్లను విభిన్న విభాగాలు సమన్వయంతో నిర్వహించాలని, ప్రముఖులను ఆహ్వానించాలని సూచించారు. రెక్టర్ ఆచార్య ఎన్. కిశోర్ బాబు, ప్రిన్సిపల్స్ కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఏర్పాట్లను వీసీ స్వయంగా పరిశీలించారు.

ట్రైబల్ ఆర్చరీ పోటీలు ప్రారంభం


ఆర్చరీ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

కొమ్మాది: బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని జన జాతీయ గౌరవ్ వర్ష్ కార్యక్రమంలో భాగంగా జన జాతీయ ఖేల్ మహోత్సవ్– ట్రైబల్ ఆర్చరీ మీట్ అట్టహాసంగా ప్రారంభమైంది. గీతం కళాశాల ప్రాంగణంలో శుక్రవారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఈ క్రీడోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజన యువత తమ సంప్రదాయ విలువలు, నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఇటువంటి వేదికలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యారంగంలోనూ గిరిజన విద్యార్థులు ముందంజలో ఉన్నారని, ఇటీవల విడుదలైన 10వ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలలో మంచి ఫలితాలు సాధించడం ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థుల కోసం విలువిద్య(ఆర్చరీ) పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో నివసిస్తున్న 27.39 లక్షల గిరిజనుల సమగ్ర సామాజిక, ఆర్థిక, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి గిరిజన కళా ప్రదర్శనలు, నృత్యోత్సవాలు, ప్రపంచ ఆదివాసీ దినోత్సవం, గిరిజన పండుగలను విశాఖ, విజయవాడ, ఐటీడీఏ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ ఆర్చరీ పోటీలకు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, అండమాన్ నికోబార్ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. టీసీఆర్‌టీఎం ఈడీ రాణిమందా సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్రదాడి మృతులకు ముస్లింల నివాళి



ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ముస్లింలు

తాటిచెట్లపాలెం: ఇటీవల జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ తాటిచెట్లపాలెంలో ముస్లింలు శాంతియుత ర్యాలీ చేపట్టారు. రైల్వే న్యూకాలనీ జంక్షన్ వద్ద గల మసీదులో శుక్రవారం ప్రార్థనలు పూర్తయిన అనంతరం, ఉగ్ర దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. హింసను విడనాడాలని, ఉగ్రవాదం పూర్తిగా అంతం కావాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో మసీదు పెద్దలతో పాటు ముస్లింలు, చిన్నారులు పాల్గొన్నారు.

హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: సంబల్‌పూర్ స్టేషన్ యార్డ్ ఆధునికీకరణ పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌ను ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. మే 2, 3, 6, 9, 10, 13, 16, 17, 20, 23, 24, 27, 30, 31, జూన్ 3, 6, 7, 10, 13, 14, 17, 20, 21, 24, 27, 28వ తేదీల్లో విశాఖపట్నం–అమృతసర్ (20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్, మే 3, 4, 7, 10, 14, 17, 18, 21, 24, 25, 28, 31, జూన్ 1, 4, 7, 8, 11, 14, 15, 18, 21, 22, 25, 28, 29వ తేదీల్లో అమృతసర్–విశాఖపట్నం(20808) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌లను దారి మళ్లించారు. ఆయా తేదీల్లో వయా సర్లజంక్షన్, సంబల్‌పూర్ సిటీ స్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు.